**యునైటెడ్ కింగ్‌డమ్‌కు విదేశీ వ్యవహారాల మంత్రి పర్యటన (మార్చి 4-9, 2025)**

మార్చి 10, 2025

యుకె విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ ఆహ్వానం మేరకు, విదేశీ వ్యవహారాల మంత్రి (EAM) డాక్టర్ ఎస్ జైశంకర్ మార్చి 4-9, 2025 నుండి యునైటెడ్ కింగ్‌డమ్‌కు అధికారిక పర్యటన చేశారు (ఇదే సమయంలో, ఈయన మార్చి 6-7, 2025 న ఐర్లాండ్‌లో కూడా పర్యటించారు). బ్రిటన్ ప్రధాని సర్ కీర్ స్టార్మర్, డిప్యూటీ ప్రధానమంత్రి ఏంజెలా రేనర్ లతో విదేశీ వ్యవహారాల మంత్రి భేటీ అయ్యారు. యుకె విదేశాంగ సెక్రటరీ డేవిడ్ లామీతో ఈయన సమగ్రమైన చర్చలు నిర్వహించారు, మరియు వ్యాపారం మరియు వాణిజ్యం మంత్రి జోనాథన్ రెనాల్డ్స్ మరియు హోమ్ సెక్రటరీ ఇవెట్ట్ కూపర్ లను కూడా కలుసుకున్నారు. ఈ పర్యటనలో, విదేశీ వ్యవహారాల మంత్రి ప్రభుత్వం, వ్యాపారం, అకాడెమియా మరియు ప్రవాస భారతీయులలో కీలకమైన వ్యక్తులను కలుసుకున్నారు.

2. ప్రధాన మంత్రి స్టార్మర్‌తో జరిగిన సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తరఫున అభివాదం తెలియజేశారు. భారతదేశం-యుకె సంబంధాలలో, ముఖ్యంగా ఉచిత వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) చర్చలు ప్రారంభం అవ్వడంతో,  ఇరు దేశాల నేతలు సానుకూల కదలికను గమనించారు. సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడం, ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరచడం, ఉక్రెయిన్ సంఘర్షణతో సహా కీలక ప్రపంచ సమస్యలపై కూడా వారు చర్చించారు.

3. విదేశాంగ సెక్రటరీ లామీ చీవినింగ్ హౌస్ వద్ద విదేశీ వ్యవహారాల మంత్రికి స్వాగతం పలికారు. వ్యూహాత్మక సమన్వయం, రాజకీయ సహకారం, వాణిజ్య చర్చలు, విద్య, సాంకేతికత, చలనశీలత మరియు ప్రజల మధ్య సంబంధాలు సహా భారతదేశం-యుకె యొక్క సమగ్ర సంబంధాల గురించి విదేశీ వ్యవహారాల మంత్రి మరియు విదేశాంగ కార్యదర్శి విస్తృత చర్చలు జరిపారు. రెండు పక్షాల ద్వారా చర్చించబడుతున్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంకి సరికొత్త శక్తి మరియు నూతన వేగాన్ని అందించే  కొత్త రోడ్‌మ్యాప్ 2.0 పై పురోగతిని వారు సమీక్షించారు. ఉక్రెయిన్ సంఘర్షణ, పశ్చిమ ఆసియా, బంగ్లాదేశ్, కామన్వెల్త్‌తో సహా ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై కూడా వారు అభిప్రాయాలను పంచుకున్నారు. ఇరువురు నేతలు భారతదేశానికి చెందిన చీవినింగ్ పండితులతో సంభాషించారు, ధృడమైన ద్వైపాక్షిక సంబంధాలను ఏర్పరచడంలో విద్య మరియు యువత పోషించే కీలకమైన పాత్రను వారు గుర్తించారు.

4. భారత-యుకె ఎఫ్‌టిఎ చర్చల పురోగతిపై వ్యాపార, వాణిజ్య శాఖ కార్యదర్శితో విదేశీ వ్యవహారాల మంత్రి యొక్క సమావేశం దృష్టి సారించింది. వాణిజ్య, పెట్టుబడుల అవకాశాలను పెంచడానికి, వాణిజ్య అడ్డంకులను తగ్గించడానికి

మరియు మార్కెట్ ప్రాప్యతను విస్తరించడానికి ఇరు పక్షాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి. హోమ్ కార్యదర్శితో జరిగి సమావేశంలో టాలెంట్ మొబిలిటీ, ప్రజల మధ్య సంబంధాలు మరియు మానవుల అక్రమ రవాణా మరియు ఉగ్రవాదం పై ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడం గురించి విదేశీ వ్యవహారాల మంత్రి చర్చించారు. మన దేశ మిషన్లు/పోస్ట్స్ మరియు రాయబారుల రక్షణ మరియు భద్రత అంశాల గురించి విదేశీ వ్యవహారాల మంత్రి పేర్కొన్నారు మరియు హెచ్‌సిఐ ప్రాంగణంలో దాడి చేసిన వారిని త్వరగా శిక్షించవలసిన ఆవశ్యకతను పునరుద్ఘాటించారు. పికెఇ కి చెందిన వారి నుండి పెరుగుతున్న భారత వ్యతిరేక కార్యకలాపాలను పరిష్కరించాల్సిన అవసరం గురించి కూడా ఆయన నొక్కిచెప్పారు.

5. ఛాతమ్ హౌస్ వద్ద దాని డైరెక్టర్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ బ్రోన్వెన్ మ్యాడాక్స్ లతో జరిగిన సంభాషణలో విదేశీ వ్యవహారాల మంత్రి పాల్గొన్నారు, మారుతున్న ప్రపంచ రాజకీయాలు, ప్రపంచ వాణిజ్యం, భారత్-యుకె మధ్య సంబంధాలు మరియు ప్రపంచ వ్యవహారాలపై భారతదేశ వైఖరి గురించి ఆయన మాట్లాడారు.

6. ఉత్తర ఐర్లాండ్ అసెంబ్లీ స్పీకర్ ఎడ్విన్ పూట్స్, మంత్రి ఫ్లూర్ ఆండర్సన్, బెల్‌ఫాస్ట్ మేయర్, కౌన్సిలర్ మిక్కి ముర్రే, మరియు భారతదేశం యొక్క గౌరవ దౌత్య ప్రతినిధి, లార్డ్ దిల్‌జిత్ రాణాతో సహా పలువురు విశిష్టమైన స్థానిక ప్రముఖుల సమక్షంలో విదేశీ వ్యవహారాల మంత్రి ఉత్తర ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్‌లో కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియాను ప్రారంభించారు. ఉత్తర ఐర్లాండ్‌లో భారతదేశం యొక్క ఉనికిని బలోపేతం చేయడంలో కాన్సులేట్ ప్రారంభం ఒక ముఖ్యమైన అడుగు, మెరుగైన వాణిజ్యం, వ్యాపారం, సాంకేతికత మరియు విద్యా సంబంధాలను ఇది సులభతరం చేస్తుంది.

7. స్టోర్మాంట్ క్యాజిల్ వద్ద ఉత్తర్ ఐర్లాండ్ యొక్క మొదటి ఉప మంత్రి ఎమ్మా లిటిల్-పెంగెల్లి మరియు జూనియర్ మంత్రి ఐస్లింగ్ రైలీ లను విదేశీ వ్యవహారాల మంత్రి కలిశారు. నైపుణ్యాల అభివృద్ధి, సైబర్ సెక్యూరిటీ, సాంకేతికత, సృజనాత్మక పరిశ్రమలు మరియు తయారీ వంటి కీలక రంగాలలో లోతైన సహకారం కోసం అవకాశాల గురించి వారు చర్చించారు.

8. బెల్‌ఫాస్ట్‌లోని క్వీన్స్ విశ్వవిద్యాలయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రి సందర్శించారు, గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో త్వరలో ఏర్పాటు కాబోయే వారి క్యాంపస్ యొక్క ప్రాముఖ్యత గురించి ఆయన పేర్కొని, ఉన్నత విద్యా రంగంలో పెరుగుతున్న భారత్-యుకె భాగస్వామ్యంకి ఇది నిదర్శనంగా నిలుస్తుంది అని పేర్కొన్నారు. క్వీన్స్ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులతో వారి అనుభవాలు మరియు ఆకాంక్షల గురించి చర్చించారు.

9. మాంచెస్టర్‌లో భారత కాన్సులేట్‌ను విదేశీ వ్యవహారాల మంత్రి ప్రారంభించారు, ఇది యుకెలో నాల్గవ భారత కాన్సులేట్, ప్రవాస భారతీయులు సుదీర్ఘ కాలంగా చేస్తున్న డిమాండ్‌ను ఇది నెరవేర్చింది మరియు ఉత్తర ఇంగ్లాండ్‌తో భారతీయ దౌత్య సంబంధాలను మెరుగుపరిచింది. ఈ సమావేశంలో డిప్యూటీ ప్రధానమంత్రి ఏంజెలా రేనర్, ఇండో-పసిఫిక్ ఎఫ్‌సిడిఓ మంత్రి క్యాథరిన్ వెస్ట్, గ్రేటర్ మాంచెస్టర్ డిప్యూటీ మేయర్ పాల్ డెనెట్, స్టాక్‌పోర్ట్ ఎంపి నవేందు మిశ్రా పాల్గొన్నారు. కొత్త కాన్సులేట్ వాణిజ్యం, సాంస్కృతిక మార్పిడి, క్రీడల రంగంతో సహా ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరచడానికి సహాయపడుతుంది అని ఆశించబడుతుంది. డిప్యూటీ ప్రధానమంత్రితో జరిగిన సమావేశంలో, మాంచెస్టర్‌లో కాన్సులేట్ ఏర్పాటుకు సంబంధించి వారు అందించిన మద్దతకు విదేశీ వ్యవహారాల మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఓల్డ్ ట్రాఫోర్డ్ వద్ద భారతీయ సమాజం మరియు వ్యాపార నాయకులతో కూడా విదేశీ వ్యవహారాల మంత్రి సంభాషించారు.

10. భారత్-యుకె సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి సరికొత్త వేగాన్ని అందిస్తూ, భారతదేశం మరియు యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య బలమైన సంబంధాలను ఈ పర్యటన పునరుద్ఘాటించింది. మారుతున్న ప్రపంచ పరిస్థితులలో రాజకీయ, ఆర్థిక మరియు ప్రజల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి రెండు దేశాల నిబద్ధతను ఇది బలపరిచింది.

లండన్

మార్చి 09, 2025